సజావుగా గ్రూప్-1 పరీక్షలు

● పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన గద్వాల జిల్లాకు చెందిన లతమ్మను అధికారులు అనుమతించక పోవడంతో విలపిస్తున్న అభ్యర్థి

బేగంపేట్ మహిళా డిగ్రీ కళాశాల గ్రూప్-1 పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

బేగంపేట్, అక్టోబర్ 21: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భాగంగా బేగంపేట్ మహిళ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో జరిగిన గ్రూప్-1 పరీక్ష సోమవారం సజావుగా జరిగింది. బేగంపేట్‌లో పీజీ కాలేజ్, బేగంపేట్ మహిళ డిగ్రీ కళాశాలలో రెండు కాలేజిల్లో గ్రూప్-1 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏసీపీ గోపాలకృష్ణ నేతృత్వంలో పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. అరగంట ముందు అంటే 1.30గంటల వరకు మాత్రమే లోపలికి అభ్యర్థులకు అనుమతించారు. గద్వాల జిల్లాకు చెందిన అభ్యర్థి లతమ్మ పరీక్ష కేంద్రానికి 1.36 గంటలకు చేరుకుంది. దీంతో పోలీసులు లోపలికి అనుమతించలేదు. అప్పటికే కళాశాల గేట్లను అధికారులు పూర్తిగా మూసివేశారు. దీంతో వికలాంగురాలైన లతమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

డీడీఎంఎస్ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతిగా పేర్కొన్నారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 16వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం

బేగంపేట్, అక్టోబర్ 21: ఇద్దరు చిన్నారులతో వివాహిత అదృశ్యమైన సంఘటన బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్ రసూల్‌పుర ఇందిరమ్మనగర్‌కు చెందిన నాగరాజు ప్రైవేట్ ఉద్యోగి. 2019లో నాగరాజుకు నిఖిత (24)తో వివాహం జరిగింది. వీరికి అఖిల్(5) దేవాన్స్(3) ఇద్దరు కుమారులు, ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిన నిఖిత తిరిగి రాలేదు. నిఖిత కోసం తన భర్త బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం బేగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాలధారణ పవిత్ర కార్యక్రమం

జెండా ఊపి మహాపాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 21: అయ్యప్ప మాలధారణ పవిత్ర కార్యక్రమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురుస్వామి వెంకటేశ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని సికింద్రాబాద్ గణపతి ఆలయం నుంచి శబరిమల వరకు 120 మంది అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణ చేపట్టడం గొప్పవిషయమని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, మహేశ్‌యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సికింద్రాబాద్ గణపతి ఆలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయంపై దాడికి పాల్పడిన నిందితుడు మహారాష్ట్రలో రెండు ఆలయాల పై దాడి చెందిన కేసులు ఉన్నాయని, అప్పుడే అతనిపై కఠిన చర్యలు తీసుకొంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం అయ్యేవి కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్రినాథ్‌యాదవ్, సి.సంతోష్‌యాదవ్, నగేశ్‌యాదవ్, బల్వంతరెడ్డి, సదానంద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబర్ 21: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.3.98 లక్షల చెక్కులను సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అపదలో ఉన్న వారికి ఆర్థిక చేయూతనందించి అదుకున్నామని తెలిపారు. అత్యధిక మంది లబ్ధిదారులకు ఆరేండ్లుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి ఆదుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, జ్ఞానేశ్వర్, గోక నవీన్, బల్వీందర్, కళ్యాణ్‌నాయక్, టీవీ రాజు, పోస్టర్ శ్రీను, నీలాదేవి, తులసీ, మంజుల, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీ, మహాధర్నా వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ టైంస్కేల్ ఉద్యోగులు మంగళవారం నిర్వహించతల పెట్టిన ర్యాలీ, మహాధర్నా వాయిదా వేసినట్టు సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి విఠల్‌గౌడ్ తెలిపారు. ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కుమార్‌తో సమావేశమైన తమ సమస్యల పరిష్కారానికి గడువు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించనిపక్షంలో తమ నిరసన కొనసాగిస్తామని చెప్పారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: జీవో 29ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏడు శాతం జనాభా లేని అగ్రవర్ణాలకు యాభై శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్న జీవో 29ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సహకారంతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో 29 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఇప్పటికైనా స్పందించి జీవోను రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఉమేశ్ చంద్ర విగ్రహానికి పుష్పాంజలి

విధి నిర్వహణలో అమరుడైన దివంగత ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర ప్రజల హృదయాల్లో సజీవంగానే ఉంటారని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. పోలీస్ అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఎస్ఆర్‌నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద ఉమేశ్‌చంద్ర తండ్రి వేణుగోపాల్‌రావు, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, సంఘ సేవకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, సర్దార్ కుల్వంతిసింగ్ పుష్పాంజలి ఘటించారు.

– అమీర్‌పేట్, అక్టోబర్ 21:

వీర భద్రీయ కుల సంఘం అధ్యక్షుడిగా బాబురావు

వీర భద్రీయ కుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 21: వీరభద్రీయ కుల సంఘం, సికింద్రాబాద్ శాఖ అధ్యక్షుడిగా మిట్టపల్లి బాబురావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మిట్టపల్లి ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా గండగత్తర వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రావుల ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. కులవృత్తులపై ఆధారపడిన బీసీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. వీరభద్రీయ కుల స్తులు ఐకమత్యంతో ఉండి, విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆయన అన్నారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలి



బేగంపేట్‌లో పర్యటించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బేగంపేట్, అక్టోబర్ 21: బేగంపేట్ డివిజన్‌లో పెండింగ్‌లో పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బేగంపేట్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. కమ్యూనిటీ హాల్‌ను స్థానికులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్, పనులు పెండింగ్‌లో ఉన్నట్టు నిర్ధారించారు. వెంటనే జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని కోరారు. అవసరమైతే మరిన్ని నిధులకు అంచనాలు తయారు చేసి అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్‌లతో పాటు బేగంపేట్ డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, అక్టోబర్ 21: దశలవారీగా సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకుంటున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం నార్త్ లాలాగూడ ఇంద్రానగర్‌కాలనీలో సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతకాలంగా అపరిష్కతంగా ఉన్న సమస్యకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు సహకారంతో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్ బాన్సోడే, సత్తయ్యగౌడ్, ఎల్లయ్య, కైరంకొండ యాదగిరి, వరలక్ష్మి, రజిత, పద్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ లక్కరాజు నిర్మలకు ఘనసన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: అమెరికాలోని ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి, కవి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ లక్కరాజు నిర్మలను ఘనంగా సన్మానించారు. తెలంగాణ జానపదం, జానపద కవిత్వం, జనపదం గురించి చక్కటి కవితలు వినిపిస్తూ తెలంగణ యాస, భాష గొప్పతనాన్ని ఖండాంతరాలకు విస్తరించినందుకు ఆమెకు సన్మానించినట్టు సన్మానపత్రంలో పేర్కొన్నారు. దానితో పాటు సామాజిక సేవాకార్యక్రమాలను చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు చేయూత

సనత్‌నగర్ డివిజన్‌లోని బీకేగూడ సంజయ్‌గాంధీనగర్‌లోని పురాతన నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు దాతల చేయూతతో వేగంగా జరుగుతున్నాయి. తనను కలిసిన దేవాలయ కమిటీ ప్రతినిధులకు బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్ తనవంతు చేయూతగా ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. పురాతన ఆలయాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని రామ్మోహన్ పిలుపునిచ్చారు.

– అమీర్‌పేట్, అక్టోబర్ 21:

రాఘవ చైతన్యకు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: ఓయూ కామర్స్ విభాగంలో ఇటికల రాఘవ చైతన్య డాక్టరేట్ సాధించారు. ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ చెన్నప్ప పర్యవేక్షణలో 'టాలెంట్ మేనేజ్‌మెంట్: యాన్ ఎంపెరికల్ స్టడీ ఆఫ్ టాలెంట్ రిటెన్షన్ స్ట్రాటజీస్ ఎట్ సెలెక్ట్ ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి చతన్య సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. రాఘవ చైతన్య సూర్యాపేట జిల్లా పెనపహాడ్ మండలం మాసారం గ్రామానికి చెందిన వారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

టీజీవో సెక్రెటరీకి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ బోయ కుమార్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అదిష్టించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: ఓయూలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వర్సిటీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం తుంగ బాలు మాట్లాడుతూ ఓయూలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నూతన హాస్టల్స్ ఓపెన్ చేసి, నూతనంగా వచ్చే విద్యార్థులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పీజీ విద్యార్థులకు రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ అనే తేడా లేకుండా హాస్టల్, మెస్ సదుపాయం కల్పించాలన్నారు. క్యాంపస్‌లో వీసీ అనుమతి లేకుండా పోలీసులు ఏ విద్యార్థిపై చర్యలు తీసుకోకుండా చూడాలన్నారు. వర్సిటీ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయాలని కోరారు. ఫీజులు తగ్గించి, పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నిజాం కళాశాలలో రద్దు చేసిన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సును పునప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఓయూ మెయిన్ గేట్లు తెరిచే ఉంచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓయూ స్వయం ప్రతిపత్తిని కాపాడేలా పాత విధానంలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేసి, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు గదరాజు చందు, రమేశ్, చటారి దశరథ్, నరేందర్, అవినాశ్, మంతెన మధు, కొంపల్లి నరేశ్, జంగయ్య, మేకల రవి, సందీప్, సురేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఓయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ దీర్ఘకాలంగా తమ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరంధాములు, డాక్టర్ కుమార్, డాక్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంను యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్)-తెలంగాణ స్టేట్ (యూటీఏసీటీఎస్) ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం యూటీఏసీటీఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.పరుశురాం మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఇటీవల కొన్ని వార్తాపత్రికల్లో (నమస్తే తెలంగాణ కాదు) ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అనని మాటలను ప్రచురించాయని తమకు చెప్పారని అన్నారు. తమ పట్ల ఆయన సానూకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఏసీటీఎస్ నాయకులు భూమయ్య, జితేందర్‌రెడ్డి, రవి, రాందాస్‌నాయక్, వినీతా పాండే, తిరుపతి, ఎం.రవి, మోహన్, పరమేశ్, శ్రీనివాస్, అర్జున్, సంధ్య, బాలకోటి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

ఓయూలో పనిచేస్తున్న అధ్యాపకులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టాటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో అధ్యాపకుల బృందం ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ యూజీసీ నిబంధనల ప్రకారం అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితిని 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచాలని అన్నారు. యూజీసీ పెండింగ్ బకాయిలను (ఆర్ఎస్‌పీ-2016) విడుదల చేయాలని కోరారు. తక్షణమే వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ఎరియర్స్, హెల్త్ కార్డులు, వయోపరిమితి పెంపు, సీపీఎస్ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సత్వరమే సీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని కోరారు. టాటా ప్రతినిధులు ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ మంగు, ప్రొఫెసర్ రాజేందర్‌నాయక్, ప్రొఫెసర్ శైలజ, డాక్టర్ అజీము న్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్య నాటకోత్సవాలు

ముషీరాబాద్, అక్టోబర్ 21: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సోమవారం నిర్వహించి పద్మ నాటకోత్సవాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్టీఏ మాజీ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. లంక లక్ష్మినారాయణ, జి.హనుమంతరావు, దైవజ్ఞశర్మ, లోకం భాస్కరరావు, సాంబశివరావు, ఆరాధన కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాకుడు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలి

చిక్కడపల్లి: ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురికాకుండా సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌ను కోరారు. సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో ప్రభుత్వ స్థలాల సంరక్షణపై చర్చించారు. మార్కెట్‌లోని 200 గజాలపైగా విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 21: విద్యారంగ కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్యాసాధనకై కృషి చేయాలని అన్నారు. పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఓయూలో మేఘ గర్జన సభను సోమవారం నిర్వహించారు. ఇంజినీరింగ్ గర్ల్స్ హాస్టల్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు పీడీఎస్‌యూ జెండాల ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్యఅతిథులుగా ప్రొ. కాశీం, డాక్టర్ కొండా నాగేశ్వరరావు, న్యాయవాది కుర్ర జితేందర్‌బాబు, డాక్టర్ నలిగంటి శరత్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు అశోక్ గాయల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జార్జిరెడ్డిని హత్య చేసిన శక్తులు నేడు దేశంలో పాలన సాగిస్తూ హిందూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో విద్యార్థులు ప్రయాణించాలని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్న కేంద్రప్రభుత్వం ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, నున్న అప్పారావు, గనిరాజు, విజయ ఖన్నా, వెంకట్‌రెడ్డి, సాంబ, కిరణ్‌కుమార్, భీంశంకర్, విజయ్, మిథ్రిన్‌సుల్తానా, గణేశ్, ధరణి, సైదులు, సుమన్, రంజిత్, వంశీ, భానుప్రసాద్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి సీఐ బాధ్యతల స్వీకరణ

చిక్కడపల్లి సీఐ రాజునాయక్

చిక్కడపల్లి,అక్టోబర్21 చిక్కడపల్లి ఇన్స్పెక్టర్‌గా రాజునాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతలు పరిరక్షణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటానని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇదివరకు ఇన్స్పెక్టర్‌గా విధుల నిర్వహించిన సీతయ్య ఎస్‌బీకి బదిలీ అయ్యారు.

వీసీల నియామకాల్లో గిరిజన ప్రొఫెసర్లకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకాల్లో లంబాడీ ప్రొఫెసర్లకు అన్యాయం జరిగిందని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో లంబాడీలది కీలకపాత్ర అని గుర్తు చేశారు. అటువంటి లంబాడీ సామాజిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని సూచించా రు. మిగిలిన వర్సిటీల వీసీల నియామకంలో లంబాడీ ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని కోరారు.

శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలి

కంటోన్మెంట్: దీపావళి సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని